సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీరాం

ప్రైవేట్ దవాఖానలు నిబంధనలు పాటించాలి

- జిల్లా వైద్యాధికారి శ్రీరాం

మెదక్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): రోగులకు చౌక ఫీజులతో నాణ్యమైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ శ్రీరాం సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రైవేట్ దవాఖానల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. డెంగీ, మలేరియా, డయేరియా వ్యాధులకు సంబంధించిన శాంపిళ్లను మెదక్‌లోని టీ హబ్‌కు పంపించాలని ప్రైవేట్ దవాఖానల డాక్టర్లను ఆదేశించారు. ప్రతి దవాఖానలో డాక్టర్, ఓపీ ఫీజు వివరాలు, పరీక్షలకు సంబంధించిన చార్ట్, సిబ్బంది వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. హైజనిక్ కండిషన్స్ పాటించాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా దవాఖాన నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లు, గైనిక్ దవాఖానలు తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ ఎంటీపీ రూల్స్ పాటించాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ నవీన్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ డెమో రమ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-జడ్పీ సీఈవో ఎల్లయ్య

రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

పెద్దశంకరంపేట, ఆగస్టు 23: అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజాపాలన కేంద్రంలో వచ్చే దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆయనతో ఎంపీడీవో రఫీకున్నీసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, సూపరింటెండెంట్ షాకీర్ తదితరులున్నారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నందిగామ గుడ్‌షేపర్డ్ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిసాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు.అండర్ 17 బాలుర విభాగం ఖోఖోలో ప్రథమ బహుమతి సాధించిన నిజాంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం జ్ఞాలమాల అభినందించారు.

– నిజాంపేట, ఆగస్టు 23:

శాలిపేటలో కొనసాగుతున్న వైద్య శిబిరం

శాలిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిన్నశంకరంపేట, ఆగస్టు 23: వ్యక్తి గత పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి సాయి సింధు సూచించారు. మండలంలోని శాలిపేటలో డెంగీతో యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. రెండు రోజులుగా ఆ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి, జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. 209 ఇండ్లను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని తొలిగించారు. కార్యక్రమంలో వైద్యుడు హృదయ్, సీహెచ్ఓ యాదగిరి, ఏఎన్ఎంలు స్వప్న, ప్రియాంక, మాల, నర్సింహులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చిన్నశంకరంపేట, ఆగస్టు 23: ప్రభుత్వం అందిస్తున్న రెండు లక్షల పంట రుణమాఫీ జమకాని రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతిఒక్కరైతుకు రుణమాఫీ డబ్బులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

చేగుంట, ఆగస్టు 23: మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసి వివిధ రకాల పుష్పమాలతో అలంకరించి, పసుపు కుంకుమాలతో అభిషేకాలు చేశారు. మహా నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ముత్తైదువులకు పసుపు బొట్టు, వాయినాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకుని, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆటోల పార్కింగ్‌తో ప్రయాణికులు ఇబ్బంది

నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో యూటర్నింగ్ వద్ద పార్కింగ్ చేసిన ఆటోలు

నర్సాపూర్, ఆగస్టు 23: నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో యూటర్న్ వద్ద ఆటోలు పార్కింగ్ చేయడంతో ప్రయాణించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. నర్సాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లే మార్గం, బస్టాండ్ నుంచి చౌరస్తాకి పోయే మార్గంలో బస్సులు యూటర్న్ తీసుకుంటాయి. ఈ ప్రదేశంలో ఆటోలు పార్కింగ్ చేయడంతో అష్టకష్టాలు పడాల్సి వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుపైనే ఆటోలు నిలిచి ఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతున్నది. ఈ పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

అందని రుణమాఫీ.. ఆందోళనలో అన్నదాత

రుణమాఫీ రాకపోవడంతో వ్యవసాయ కార్యాలయానికి వచ్చిన రైతులు, వివరాలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

- మండల కార్యాలయాల్లో దరఖాస్తుల వెల్లువ
- వ్యవసాయశాఖ సర్వర్ డౌన్‌తో అన్నదాతల ఇబ్బందులు
- అర్హులైన ప్రతి రైతుకూ రుణమివ్వాలి: బీఆర్ఎస్ నాయకులు

వెల్దుర్తి, ఆగస్టు 23:ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. వందలాది మంది వ్యవసాయ కార్యాలయానికి, బ్యాంకుల వద్దకు తిరగాల్సి వస్తోంది. రైతులకు అధికారులు చెబుతున్న కారణాలతో ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ, ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలో పేరు సరిగ్గా ఉన్న రుణమాఫీ కాకపోవడం, చిన్నచిన్న అక్షర తప్పులతో కూడా రుణమాఫీ చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల రుణమాఫీలో ఉమ్మడి వెల్దుర్తి మండలంలో 7897 మంది రైతులకు రూ.68.06 కోట్ల రుణమాఫీ అయ్యిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తు చేయడానికి వెళ్లిన రైతులు సర్వర్ డౌన్ కారణంతో గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. బ్యాంకుల్లో సరైన సమాధానం రాక అసహానానికి గురవుతున్నారు. వెల్దుర్తి ఏఈవో కార్యాలయానికి వెళ్లిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి రుణమాఫీ వివరాలను స్థానిక ఏఈవో వందనను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ అందించాలని డిమాండ్ చేశారు.

వివరాలు సరిగ్గా ఉన్నా రుణమాఫీ కాలే..

నాకు 2.20 ఎకరాల భూమి ఉంది. సొసైటీలో రూ.40 వేల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడతల్లో రుణమాఫీ కాలే. ఎందుకు అని అడగగా పేరు తప్పుగా ఉందంటున్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలో పేరు సరిగ్గా ఉన్నా నాకు రుణమాఫీ కాలే.

- కామారం నర్సింలు, రైతు ఉప్పలింగాపూర్, వెల్దుర్తి

తప్పులు లేకున్నా రుణమాఫీ కాలే..

నాకు 2.16 ఎకరాలు, నా భార్య మేఘమాలకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇద్దరికి సెంట్రల్ బ్యాంకు లో ఖాతాలు ఉన్నాయి. నా పేరు మీద రూ.70 వేలు, భార్య పేరుమీద రూ.60 వేల క్రాప్ లోన్ తీసుకున్నాం. మూడు విడతల్లోనూ రుణమాఫీ కాలేదు. దీంతో బ్యాంకుకు, వ్యవసాయ అధికారుల వద్దకు తిరుగుతున్నం. **- సట్టి పోచయ్య, రైతు ఉప్పలింగాపూర్**

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ: చంద్రయాన్-3 నమూనాలు ప్రదర్శిస్తున్న సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు

పాపన్నపేట, ఆగస్టు 23: పాపన్నపేట ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు చంద్రయాన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వర్, సైన్స్ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, యాదయ్య, వేణుగోపాల్ రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.



రామాయంపేట: విక్రం ల్యాండర్ వ్యోమగాముల వేషధారణలో వివేకానంద స్కూల్ విద్యార్థులు

రామాయంపేటలో..

రామాయంపేట, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పట్టణంలోని వివేకానంద విద్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రవేశపెట్టిన విక్రమ్, ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్, అంతరిక్ష నమూనాలు, వేషధారణ ఆకట్టుకున్నాయి. చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించి ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాపన్నపేట: స్క్రీన్‌ల ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

మెదక్ పట్టణంలో

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 23: చంద్రాయణ్-3 విజయవంతమైన ఆగస్టు 23ను పురస్కరించుకుని మెదక్‌లోని సిద్ధార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో ఖగోళంలో జరిగే మార్పులపై అవగాహన కల్పించారు.

కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 23: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో పట్టణంతో పాటు మండలానికి చెందిన 78 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, కౌన్సిలర్లు లింగం, లక్ష్మి, నాయకులు శంకర్, శ్రీనివాస్ చౌదరి, వెంకట్ ప్రభాకర్, సిద్దయ్య, ఆంజనేయులు, ముత్యంగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మాన్‌ను మార్చాలని ఆందోళన

పంచాయతీ వద్ద పోస్టుమాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

నర్సాపూర్, ఆగస్టు 23: ఉపాధి హామీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న పోస్ట్‌మాన్‌ను మార్చాలని మండలంలోని లింగాపూర్ గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఉపాధి పనులకు డబ్బులు పోస్టాఫీస్ ఖాతాలో జమ అవుతాయని, ఈ డబ్బులు ఇవ్వడానికి పోస్ట్‌మాన్ లింగాపూర్ పంచాయతీ వద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణపల్లి, గొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాల ఉపాధి కూలీలు భారీగా అక్కడికి చేరుకున్నారు. ఉపాధి డబ్బులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాడని పోస్ట్‌మాన్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎందుకు ఇవ్వడంలేదని అతడితో వాగ్వాదానికి దిగారు. పోస్ట్‌మాన్ పై చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. ఈ విషయంలో పోస్ట్‌మాన్ చందూను వివరణ కోరగా ఎన్ఆర్ఈజీఎస్ డబ్బులు గతంలో బయోమెట్రిక్ ద్వారా ఉపాధి కూలీలకు డబ్బులు త్వరగా ఇచ్చేవారమని, ఇప్పుడు అలా కాకుండా ఓటర్ రాయడం, సంతకాలు తీసుకోవడం ద్వారా చెల్లిస్తుండడంతో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఈ విధానంతో ఆలస్యమవుతున్నదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

రేగోడ్, ఆగస్టు 23: ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు శుక్రవారం 45 మందికి రూ.13.22లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

ఆర్థిక నేరాలపై అవగాహన అవసరం

నర్సాపూర్, ఆగష్టు 23: ఆర్థిక నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కళాశాల ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకుడు డాక్టర్ ఆదెప్ప తెలిపారు. ఆర్థిక నేరాలపై 1930 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఎస్బీఐ రీసోర్స్ పర్సన్ వారితో సైబర్ ఆర్థిక నేరాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, అంతర్జాల వినియోగం, వాట్సాప్ సందేశం, ఈమెయిల్ ద్వారా జరిగే మోసాలను విద్యార్థులకు ఎస్‌బీఐ సిబ్బంది వినోద్, బషీర్, షాబాజ్ వివరించారు. ఆర్థిక అక్షరాస్యతలో భాగంగా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్యా సమృద్ధి యోజన, ఫసల్ బీమా యోజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమీరా, ఉపన్యాసకులు రమేష్, శ్రీనివాస్, డాక్టరుఉల్ల సౌజన్య, సురేశ్‌కుమార్, అనిత, రుక్మిణీదేవి, ఖాజా ఆరీఫ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మా గ్రామాలను పంచాయతీగా మార్చండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట, ఆగస్టు 23: పురపాలికలో వీలినంతో తమ గ్రామం అభివృద్ధికి నోచుకోవడం లేదని, పంచాయతీగా మార్చాలని కోమటిపల్లి గ్రామస్తులు కోరారు. శుక్రవారం కోమటిపల్లి, గిరిజన తండా, వడ్డెరబస్తీ వాసులు తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయంపేట పురపాలికలో ఉన్న తమ గ్రామాలు పదేండ్లుగా అభివృద్ధి చెందలేదన్నారు. ఇంటి ట్యాక్సులను పెంచి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మున్సిపల్‌తో తాము నష్టపోతున్నామన్నారు. మున్సిపాలిటీలోంచి తొలిగించి మూడు గ్రామాలను కలిపి పంచాయతీగా మార్చాలని కోరారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

వెల్దుర్తి, ఆగస్టు 23: లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, సంరక్షించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఉమ్మడి వెల్దుర్తి మండలంలో పర్యటించారు. మాసాయిపేట మండలంలోని హక్కింపేటలో ఎంపీడీవో ఉమాదేవి, ఏపీవో రాజుతో కలిసి నర్సరీని సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం వెల్దుర్తి ఐకేపీ కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు కల్పించాలని, భూగర్భ జలాల పెంపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇంటికో ఇంకుడు గుంత తీయించాలని సూచించారు. సమావేశాల్లో ఎంపీవో ఝిన్నేశ్వర్, ఏపీఎం శంకరయ్య, సీసీలు, వీవోఏలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌తో చదువు కొనసాగింపు

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న డీఈవో, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 23: ఆగిపోయిన చదువు కొనసాగించేందుకు ఓపెన్ స్కూల్‌తో చక్కని అవకాశం ఉంటుందని డీఈవో రాధాకిషన్ అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో 2024-25 విద్యా సంత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ గోడ పత్రికను ఉమ్మడి మెదక్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి, ఏఎమ్ఓ సుదర్శనమూర్తితో కలిసి ఆవిష్కరించారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు పొందేందుకు అవకాశం ఉన్నదని డీఈవో తెలిపారు. ఈ సర్టిఫికెట్ రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నిజాంపేట, ఆగస్టు 23: నస్కల్ గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటయ్య(53) గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ మోహన్‌నాయక్ శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

30, 31న ఎస్టీఎఫ్ క్రీడలు

పాపన్నపేట, ఆగస్టు 23: పాపన్నపేటలో ఈనెల 30, 31వ తేదీల్లో ఎస్టీఎఫ్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు స్థానిక పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేశ్ తెలిపారు. 30న బాలికలకు, 31న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17 ఏండ్లలోపు బాల, బాలికలు పాల్గొనాలని తెలిపారు. వివరాలకు 8985536704, 9010735121 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పాస్‌బుక్ తనఖా లేకుండా రుణాలు

పాపన్నపేట, ఆగస్టు 23: పట్టా పాస్‌బుక్ తనఖా లేకుండానే రైతులకు రుణాలు ఇస్తామని డీసీసీబీ పాపన్నపేట మేనేజర్ కిషన్ జాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.1.60 లక్షల రుణం వరకు మార్టిగేజ్ చేసుకోబోమన్నారు. ధరణి చార్జి క్రియేషన్ చేసి రుణం ఇస్తామన్నారు. అసైన్డ్ భూములకూ రుణాలిస్తామన్నారు. రైతునేస్తం పథకం ద్వారా ఎకరానికి రూ.4లక్షల చొప్పున, పౌల్ట్రీ, డెయిరీ, షిప్ ఫామ్‌లకు రుణాలిస్తామన్నారు. చీకోడ్ సొసైటీలో ఎల్‌టీ లోన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట చీకోడ్ సొసైటీ చైర్మన్ దత్తరాజ్ ఉన్నారు.

ఫైనాన్సియల్ లిటరసీపై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 23: ఫైనాన్సియల్ లిటరసీపై సర్టిఫికెట్ కోర్సును స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ హుస్సేన్ తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, ఎఫ్‌టీసీసీఐ అండ్ ఎన్‌సీఎల్ సంయుక్తంగా ఈ కోర్స్ ప్రారంభించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థిక అక్షరాస్యతను కల్పించడానికి ఈ కోర్స్ ఉపయోగపడుతుందన్నారు. కాల వ్యవధి మూడు నెలలు ఉంటుందన్నారు.

కారు చక్రాలు చోరీ

చక్రాలు చోరీ అయిన కార్లు

నిజాంపేట,ఆగస్టు23: కారు చక్రాలు చోరీ అయిన ఘటన నిజాంపేటలో శుక్రవారం జరిగింది. నిజాంపేటలోని గాంధీ విగ్రహం, నూతన బస్టాండ్ వద్ద నిలిపిన సురేశ్‌కుమార్, గడ్డం రాజు, పంజా మహేందర్‌కు చెందిన కార్ల నుంచి 8 చక్రాలను దుండగులు చోరీ చేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంతారం మాజీ సర్పంచ్ రామాగౌడ్ మృతి



రామాగౌడ్ (ఫైల్)

చిలిపిచెడ్, ఆగస్టు 23: అంతారం మాజీ సర్పంచ్ జక్కపల్లి రామాగౌడ్ (75) గురువారం రాత్రి మృతి చెందాడు. శుక్రవారం రామాగౌడ్ పార్థివ దేహానికి చిలిపిచెడ్, కౌడిపల్లి మండలాల వివిధ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శేషసాయిరెడ్డి, సుహాసినిరెడ్డి, ఆవుల రాజిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సర్పంచులు, నాయకులు రామాగౌడ్ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

చిలిపిచెడ్, ఆగస్టు 23: చిలిపిచెడ్: ఫైజాబాద్‌లో మురుగు నీటిని శుభ్రం పనులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి మాన్య నాయక్, గ్రామ కార్యదర్శి నాగరాజు

హెచ్ఎం అంత్యక్రియలకు మైనంపల్లి హాజరు

రామాయంపేట, ఆగస్టు 23: ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రవీందర్‌గౌడ్ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శుక్రవారం హాజరై, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్‌లేని హోమియో

పరిష్కారం, 47 సం।। అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.

NT- 332617

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.